క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూలపల్లి: రైతులు వానాకాలంలో పంటల సాగుకు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. మండలంలోని కుమ్మరికుంట, వడ్కాపూర్, చీమలపేట గ్రామాల్లో రైతులు, విత్తన, పెస్టిసైడ్స్ దుకాణ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ అనుమతి ఉన్న దుకాణ డీలర్ల వద్దే విత్తనాలు ఎంపిక చేసుకుని, రశీదు తీసుకోవాలని, పంటలు కోతకు వచ్చే వరకు రశీదులు భద్రపరచుకోవాలని సూచించారు. డీలర్లు ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ప్రతి కొనుగోలుకు రశీదు ఇవ్వాలన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు కిరణ్మయి, రాకేశ్, శ్రీవాణి, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

బీరన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

జూలపల్లి: మండల కేంద్రంలో కురుమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీరన్న, కామరాతి కల్యాణం, పట్నాలు, బోనాల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక బీరప్ప ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు పాలు, నెయ్యితో అభిషేకం చేసిన బీర్ల పూజారులు ప్రతిమలను దగ్గరలోని బావిలో దాచి నేడు బీర్ల పూజారుల కత్తి సాముల మధ్య బావిలో వెతికి తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమానికి కురుమ కులబాంధవులతో పాటు గ్రామాల నుంచి భక్తులు వస్తారు.

వాకింగ్ ట్రాక్ పునరుద్ధరించాలి

రామగిరి: సెంటనరీకాలనీ రాణిరుద్రమ దేవి స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలని శుక్రవారం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. గుంతలమయంగా మారి వాకింగ్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సింగరేణి కార్మికులు, కార్మికుల కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత యువకులు, మహిళలు ప్రతిరోజూ వాకింగ్ చేస్తారని, వెంటనే మరమ్మతు చేయాలని కోరినట్లు తిరుపతియాదవ్ తెలిపారు. రానున్న వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయించండి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను సత్వరమే పూర్తి చేయించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) ప్రత్యేక చొరవ చూపించాలని ఎంపీడీవో ఎంఏ.అలీం ఆదేశించారు. అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి, మొగల్‌పహాడ్, రాయదండి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రాయదండి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎంపీడీవో పాల్గొని పలు అభివృద్ధి విషయాలపై చర్చించారు.

మహిళా శక్తి కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం


కుట్టుశిక్షణ కేంద్రంలో మహిళలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలో శుక్రవారం మహిళా శక్తి కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం సంది నర్సమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 2,578 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందించే రెండు జతల ఉచిత యూనిఫాం దుస్తులను స్వశక్తి మహిళా సంఘాలకు తయారు చేసే బాధ్యతలను అప్పగించారు. ఇందులో భాగంగా క్లాత్‌ను సంఘాలకు ప్రభుత్వమే అందజేయగా దారం, ఇతరత్రా వస్తువులతో యూనిఫాం కుట్టి అందించే బాధ్యత స్వశక్తి మహిళలదేనన్నారు. ఇందుకు గాను ఒక్కో జతకు రూ.50 చెల్లిస్తుండగా ప్రస్తుతం ఒక జతకు మాత్రమే ఆర్డర్ వచ్చిందని ఏపీఎం పేర్కొన్నారు. పెద్దంపేట గ్రామంలోని మహిళా శక్తి కుట్టుశిక్షణ కేంద్రంలోని 30 మంది మహిళలకు ఉపాధి దొరికిందన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక, కనగర్తి, ఇందుర్తి గ్రామాల్లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపులకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు. అనుమతి లేని వాహనాలకు జరిమానా విధించారు.

పేరుకుపోతున్న ధాన్యం


కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు


ప్రైవేటు కాంటా ఆపాలని సూచిస్తున్న తహసీల్దారు

- కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత
- అధికారులు చెప్పినా.. ఊపందుకోని ధాన్యం రవాణా
- ఆందోళనలో అన్నదాతలు

జూలపల్లి: అకాల వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడుస్తోంది. హమాలీ కార్మికులు బయట కాంటాలకు వెళ్లడంతో తూకం వేసి లారీల్లో నింపేవారు లేక 15రోజుల నుంచి రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు. గురువారం ఉదయం రైతులు తాము తెచ్చిన ధాన్యాన్ని ఆరబెడుతూ తహసీల్దారుకు సమాచారం ఇవ్వడంతో వెంటనే కొనుగోలు కేంద్రానికి వచ్చిన తహసీల్దారు బషీరోద్దీన్ సెంటర్ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే బయట కాంటాలు పెట్టే వారిని బంద్ చేయించాలని, అవసరమనుకుంటే తాను వస్తానన్నారు. హమాలీ కార్మికులతో మాట్లాడి కాంటాలు నడిపించాలని, ధాన్యం వెంటనే రవాణా చేయాలని సూచించారు. పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ధాన్యం తెచ్చి 15 రోజులైంది



ధాన్యం తెచ్చి పదిహేను రోజులైంది. హమాలీలు లేక ధాన్యం లారీల్లో నింపక పోవడంతో అకాల వర్షానికి బస్తాలు తడిసినయి. బస్తాలు తీసుకెళ్లక పోవడంతో కొనుగోలు కేంద్రంలోనే ఉండాల్సి వస్తోంది.
– కొండ సత్యనారాయణ, రైతు, జూలపల్లి

వెంటనే కొనుగోలు చేయాలి



కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులు అకాల వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తూకం వేసి వెంటనే లారీల్లో నింపి పంపించాలి. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి. హమాలీ కార్మికుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి.
– కొప్పుల మహేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు

అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రాసకొండ లక్ష్మి

కమాన్‌పూర్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ రాసకొండ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చాలా శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరు కావడంతో పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జూలపల్లి గ్రామ చెరువులో నిబంధనలు ఉల్లంఘించి ఇటీవల మట్టి తవ్వకాలు చేపట్టినా.. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గ్రామాల్లో అనేక సమస్యలున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్, ఎంపీటీసీలు కోలేటి చంద్రశేఖర్, శెవ్వ శంకరయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, తహసీల్దార్ ఆరీఫోద్దిన్, ఎంపీవో శేషయ్య సూరి పాల్గొన్నారు.

రివైజ్డ్ పెన్షన్ చెల్లింపు ఉత్తర్వు కాపీలు ఇవ్వండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రివైజ్డ్ చెల్లింపు ఉత్తర్వు కాపీలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శుక్రవారం ఓసీపీ–3 సీహెచ్‌పీ ఎస్ఈ సదానందంను కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో మూడు దశాబ్దాల పాటు పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులు, ఉద్యోగులు రివైజ్డ్ పెన్షన్ చెల్లింపు కోసం ఆరునెలలు గడిచినా ఎదురుచూస్తున్నా ఉత్తర్వులు రాలేదన్నారు. దీంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అదే విధంగా కొంత మంది పెన్షన్ దారులు మరణించారని, వారి నామినీలు పెన్షన్ పొందేందుకు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు తప్పనిసరి అన్నారు. రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్నారని, వారిని యాజమాన్యం ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి రాజారత్నం, గుంపుల కుమారస్వామి, కలవల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న బీజేపీ రామగుండం ఇన్‌చార్జి

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సొంత వాహనంలో ఆస్పత్రికి తరలింపు


ఆస్పత్రికి తరలిస్తున్న కందుల సంధ్యారాణి

జ్యోతినగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సొంత వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లి మానవత్వాన్ని చాటుకున్నారు బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారిపై గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు ఆరెల్లి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి యూటర్న్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అదే మార్గంలో వెళ్తున్న కందుల సంధ్యారాణి వెంటనే స్పందించి గాయపడిన వారిని సొంత వాహనంలో సింగరేణి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

రైతుల ధర్నా



మంథని: పోతారంలో చేపట్టిన సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా సుమారు 70 ఎకరాలకు సాగునీరు అందకుండా పోతోందని పేర్కొంటూ రైతులు ప్లాంట్ ఎదుట ధర్నా చేశారు.

డ్రైనేజీల్లో పూడికతీత



రామగుండం: వర్షాకాలంలో మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు వీలుగా కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో డ్రైనేజీల్లో పూడికతీత జోరుగా సాగుతోంది.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


మంగళహారతితో మహిళలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల శ్రీసాంబమూర్తి ఆంజనేయ శివపంచాయతన దేవాలయంలో శుక్రవారం వార్షిక వేడుకలు, శివపార్వతుల కల్యాణ మహోత్సం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం బిల్వార్చన, పంచామృతాలు, మామిడిపండ్ల రసాలతో అభిషేకాలు, అర్చనలు, చేశారు. అర్చక పూజారి సాంబయ్యగారు వేదమంత్రాలతో వార్షిక వేడుకలు, శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిపించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లకు సారె చీర, ఒడిబియ్యం పోశారు. భజనలు కీర్తనలతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రావి సదానందం దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఎకో పార్కు సందర్శన


పిల్లలతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమ

మంథని: మున్సిపల్ పరిధిలో బోయిన్‌పేట దారిలో ఉన్న ఎకో పార్కును మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ శుక్రవారం సందర్శించారు. పార్కులో చెత్త, పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో వాటిని తొలగించారు. దీంతో చాలా మంది పిల్లలు పార్కుకు రావడంతో సందడిగా మారింది. చైర్‌పర్సన్ పార్కును సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. అలాగే బొక్కలవాగు కట్టపై ఉన్న ఓపెన్ జిమ్‌ను సందర్శించి అక్కడ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించేలా మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే పాత పెట్రోల్ బంక్ నుంచి బస్సు డిపో వరకు, గాంధీ చౌక్, బతుకమ్మ చౌక్‌తో పాటు ఇతర ఏరియాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రజలకు అసౌకర్యం కలగకుండా సరైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ, హనుమాన్ దీక్ష సేవాసమితి సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో వివరాలు వెల్లడించారు. జూన్ 1న హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకొని ఈనెల 25న శనివారం అష్టోత్తర శతనామ చాలీసా (108సార్లు) పారాయణం, 28న మంగళవారం అఖండ శ్రీరామనామ పారాయణం, మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం, 29న బుధవారం సాయంత్రం హనుమాన్ స్వామి ఉత్సవ విగ్రహాలతో కాలనీలో మహా శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పూజ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుమంత్ ఆచార్యులు, ఆలయ కమిటీ, హనుమాన్ దీక్ష సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఓబీ కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

గోదావరిఖని: సింగరేణి ప్రైవేటు ఓబీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కె.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓసీపీ–3 ప్రయివేట్ ఓబీ కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 30వేలకు పైగా కాంటాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. సింగరేణి కంపెనీ కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు ఓబీ కంపెనీలపై సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. ఓబీల్లో పనిచేస్తున్న వోల్వో డ్రైవర్లను ఆపరేటర్లుగా గుర్తించాలని, హైస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న వారికి స్కిల్ వేతనాలు చెల్లించాలన్నారు. శ్రీనివాస్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం


హాజరైన విద్యార్థులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు పరీక్షల ఇన్‌చార్జి మేరాజ్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆయన పేర్కొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పెద్దాపూర్‌లోని ఆదర్శ విద్యాలయంతో పాటు కస్తూర్బా విద్యాలయం విద్యార్థులకు స్థానిక కళాశాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించారు. ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షకు 61 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 23 మంది హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్ కె.సుధాకర్, డివో రాజేందర్ పర్యవేక్షించగా, స్క్వాడ్ గణేశ్ సెంటర్లను తనిఖీ చేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

కమాన్‌పూర్: ఎరువుల షాపుల నిర్వాహకులు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై పోలీస్‌శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మామిడి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎరువుల షాపు యజమానులకు నకిలీ విత్తాల అమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పకుండా బిల్లులు తీసుకోవాలన్నారు. ఏవో బండి ప్రమోద్‌కుమార్, ఎరువుల ఎరువుల షాపు యజమానులు పాల్గొన్నారు.

ఓదెల: వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఓదెల వ్యవసాయాధికారి నాగార్జున పేర్కొన్నారు. శుక్రవారం ఓదెలలో రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో సేద్యానికి కావాల్సిన విత్తనాలను కంపెనీ, రశీదుతో తీసుకొని కొనాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఏఈవో సంధ్య ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: నగరంలోని రాంమందిర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రమేశ్‌నగర్, ఎల్బీనగర్, అడ్డగుంటపల్లి ఏరియాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి 11 వరకు 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కె.సంపత్ తెలిపారు.

ఆదివాసీలపై సైనిక దాడులు ఆపాలి

గోదావరిఖని: ఆదివాసీలపై సైనిక దాడులను వెంటనే ఆపాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత అమానుషంగా ఆరునెలల పాప మొదలు 18 సంవత్సరాల యువతను హత్య చేశారని ఆరోపించారు.

రెండు గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు కాచాపూర్‌లో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కాచాపూర్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఖిలావనపర్తి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి స్వామి తీవ్రంగా గాయపడ్డాడు. కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఈసుపత్రికి తరలించారు. స్థానిక ఠాణాకు సమాచారం ఇవ్వడంతో సీసీ పుటేజీలను పరిశీలించగా ఆచూకీ లభించలేదు. అలాగే మండల కేంద్రం నుంచి కరీనంగర్ వైపు వెళ్తున్న కరీంనగర్‌కు చెందిన పృథ్వీ కారులో వేగంగా వచ్చి, స్థానిక సబ్‌స్టేషన్ వద్ద పాటకుల గట్టయ్యకు చెందిన గేదెలను ఢీకొన్నాడు. కాగా ఒక గేదె మృత్యువాత పడగా మరో గేదెకు తీవ్రంగా గాయాలయ్యాయి. కారు ముందు భాగంగా పూర్తిగా ధ్వంసం కాగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గేదెలు జెర్సీ జాతికి చెందినవి కావడంతో రూ.80వేల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు గట్టయ్య వాపోయాడు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరాడు. పోలీసులను వివరణ కోరగా బాధితులు ఎవరూ ఇంత వరకు ఫిర్యాదు చేయలేదన్నారు.

ఎన్టీపీసీ స్పందన క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా నియామకం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని స్పందన్ క్లబ్ ఎన్నికల క్రమంలో 2024–25కు గాను పలు పదవులకు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 26న ఎన్నికలు జరగాల్సి ఉండగా పోటీలో ఉన్న వారు అందరూ కలిసి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వీర విహార్, జాయింగ్ సెక్రటరిగా సుధీర్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సునీల్ ఆసారాం, సౌరభ్ కుమార్ వర్మ, అంకిత్ సింగ్, ప్రదీప్‌కుమార్ మండల్, ప్రణవ్ కుమార్ ప్రజాపతిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్వామి, వినీత్‌కుమార్ ఝా తెలిపారు.

ఆలయంలో రథ ప్రతిష్ఠ

ఎలిగేడు: మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి తిరుక్కల్యాణోవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో వైభవంగా రథ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు.

మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించాలి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో కొత్తగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం కోసం కాంట్రాక్టర్ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో తవ్విన గోతిలో విఠల్‌నగర్‌కు చెందిన రావుల విజయ్‌పడి మృతి చెందిన ఘటనకు కాంట్రాక్టర్‌ను బాధ్యులను చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి రాజారత్నం, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల దినేశ్, నగర కార్యదర్శి ఎర్రల రాజయ్య, నాయకులు ప్రసాద్, సుద్దాల అనురాజ్ కలిసి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీవుడే దేవుడు, దేహమే దేవాలయం

జ్యోతినగర్: జీవుడే దేవుడు, దేహమే దేవాలయమని, అలాంటి దేవాలయంలో జీవులని చంపి కడుపులో వేయరాదని, మానవుని పొట్ట శ్మశానం కాదని ప్రముఖ ధ్యాన బోధకురాలు గీతాంజలి అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో తటవర్తి వీరా రాఘవరావు దంపతుల మార్గదర్శనంలో రమాదేవి నిర్వహించిన మూడురోజుల ఉచిత ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ధ్యానంతో మానసిక ప్రశాంతతో పాటు శారీరక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. మాంసం భుజిస్తే జీర్ణం కావడానికి 72 గంటలు సమయం పడుతుందని, శాకాహారం తింటే 4గంటల సమయం పడుతుందని వివరించారు. ధ్యానం చేయడంతో మనిషిలోని 72వేల నాడులు శుద్ధి అవుతాయని, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, నిత్యం ధ్యానం చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

జూలపల్లి: ఉపాధి పనులకు వెళ్లే కార్మికులు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఉపాధి పనుల నిర్వహణ స్థలం వద్ద కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉదయం పనులు చేయాలని, పని స్థలం వద్ద తాగునీరు, నీడ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీహెచ్‌వో కలీమొద్దీన్, ఏపీవో సదానందం, ఎఫ్ఏ నర్సయ్య, మేట్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న అధికారి

ముత్తారం: మండలంలోని మచ్చుపేట పంచాయతీలోని శుక్రవారం పేటలో మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వర్షాకాలం పంట వేసే క్రమంలో వరికోసిన కొయ్యలను కాల్చ కూడదని, కాల్చితే కలిగే నష్టాలను రైతులకు ఆయన వివరించారు. కొయ్యలను కాల్చకుండా నీరు వేసి 3బస్తా ఎస్ఎస్‌పీ వేస్తే వరి కొయ్యకాళ్లు మురిగి భూసారం పెరుగుతుందన్నారు. వరిసాగుకు ముందు పచ్చిరొట్టె, జీలుగు వేసి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే క్రమంలో రశీదు తీసుకొని, గడువు కాలం సరిచూసుకోవాలని సూచించారు. ఏఈవో హారిక ఉన్నారు.

డ్రోన్‌తో చెరువు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: మండలంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన అమృత్ సరోవర్, ఎమ్ఐ ట్యాంకులను శుక్రవారం ఈజీఎస్ అధికారులు డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించారు. కుమ్మరికుంట కొత్త చెరువు, అబ్బాపూర్ సమ్మక్క, సారలమ్మ గుట్ట చెరువు, చీమలపేట ఊర చెరువులో ఈజీఎస్ ద్వారా చేసిన మట్టి పనులను డ్రోన్ కెమెరా ఉపయోగించి పరిశీలించారు. పరిశీలనలో ఏపీడీ సత్యనారాయణ, ఏఈలు రాజ్‌కుమార్, మల్లయ్య, ఏపీవో సదానందం, టీఏలు శ్రీకర్, రంజిత్ పాల్గొన్నారు.